సాక్షి హనుమకొండ

బుధవారం | 3 | జూలై | 2024



వెలగని వీధిదీపం - 8లో▸

గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ బల్బులు వెలగడం లేదు. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ సంస్థకు బిల్లులు చెల్లించకపోవడంతో సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.



జనగామలో భారీ దొంగతనం

తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదు ఎత్తుకెళ్లిన ఘటన జనగామలో చోటు చేసుకుంది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
36^0 /25^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

ఇక ప్రత్యేక పాలన

- నేటితో ముగియనున్న మండల పరిషత్ పాలకవర్గాల కాల పరిమితి
- రేపటితో జిల్లా పరిషత్ పాలక మండలి కూడా..
- స్థానిక సంస్థల ఎన్నికలపై రాని స్పష్టత





హన్మకొండ: స్థానిక సంస్థల పాలక మండళ్ల కాలపరిమితి ఒక్కొక్కటిగా ముగుస్తోంది. ఇప్పటికే గ్రామ పంచాయతీల పాలకవర్గాల కాల పరిమితి ముగియగా.. ఈనెల మూడున మండల పరిషత్‌లు, నాలుగున జిల్లా పరిషత్‌ల పాలక మండళ్ల పదవీ కాలం పూర్తికానుంది. స్థానిక సంస్థల పాలక మండళ్ల గడువు ముగిసినా.. ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఎన్నికల నిర్వహణ సందిగ్ధంలో పడింది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనేది కూడా చెప్పడం లేదు. మరో వైపు ముందుగా బీసీ కుల గణన చేసిన తర్వాత.. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈక్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై స్పష్టత కరువైంది.

ఈసారి కూడా అవే రిజర్వేషన్లు..

మండల పరిషత్‌ల పాలక మండళ్ల పదవీ కాలం బుధవారంతో ముగియనుంది. ప్రభుత్వం ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నా.. ఎన్నికల నిర్వహణకు చాలా సమయమే పడుతుంది. షెడ్యూల్ విడుదల, ఓటరు జాబితా తయారీ, రిజర్వేషన్ల ఖరారు, నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల సిబ్బంది నియామకం, పోలింగ్ నిర్వహణ వంటి ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం కనీసం రెండు నెలల సమయమైనా పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడి స్థానంలో ప్రత్యేకాధికారులను నియమించే అవకాశముంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించింది. ఈక్రమంలో వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, జెడ్పీ చైర్‌పర్సన్ల రిజర్వేషన్లు రెండు పర్యాయాలు (10 సంవత్సరాలు) వర్తించేలా చట్టం చేసింది. ఈమేరకు ఈసారి కూడా అవే రిజర్వేషన్లు అమలుకానున్నాయి. మరో వైపు బీసీ జనగణన చేసి బీసీలకు రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్ వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి పంచాయతీరాజ్ చట్ట సవరణకు వెళ్తుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో కొత్త మండలాలు ఏర్పాటయ్యాయి. వాటికి రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీంతో రిజర్వేషన్ల అంశం గందరగోళంగా మారనుంది.

గతంలో మాదిరిగానే!

గతంలోనూ ఎన్నికలు నిర్వహించలేని సందర్భంలో జిల్లా స్థాయి అధికారిని మండల పరిషత్‌లకు ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఈసారి కూడా ఇదే విధానాన్ని అవలంబించనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈమేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడొచ్చని చర్చ సాగుతోంది. వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో 86 మంది ఎంపీటీసీ సభ్యులకు ప్రస్తుతం 83 మంది ఉన్నారు. మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వరంగల్ రూరల్ జిల్లాలో 178 ఎంపీటీసీలున్నారు. వీరి కాల పరిమితి బుధవారంతో ముగియనుంది. అదే విధంగా వరంగల్ అర్బన్ జిల్లా పరిషత్‌లో ఏడుగురు జెడ్పీటీసీలున్నారు. ఇందులో ఒకరు చైర్మన్, మరొకరు వైస్ చైర్మన్ కాగా.. మరో ఐదుగురు సభ్యులున్నారు. వరంగల్ రూరల్ జిల్లా పరిషత్‌లో 16 మంది జెడ్పీటీసీలున్నారు. ఇందులో ఒకరు చైర్‌పర్సన్, మరొకరు వైస్ చైర్మన్ కాగా.. 14 మంది జెడ్పీటీసీలున్నారు. వీరి కాల పరిమితి గురువారం ముగియనుంది.

చైర్మన్లు ఇద్దరూ హనుమకొండ జిల్లా వారే..

వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లా పరిషత్ చైర్మన్లు ఇద్దరూ హనుమకొండ జిల్లాలోని మండలాల నుంచి జెడ్పీటీసీలుగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. రాష్ట్రంలో ముందుగా జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలుగా ఏర్పాటయ్యాయి. ఈమేరకు రెండు జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించారు. తర్వాత కాలంలో అర్బన్, రూరల్ బాగా లేవని హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా పునర్విభజన చేశారు. ఈక్రమంలో రెండు జిల్లాల్లోని మండలాల సంఖ్య ఇంచుమించుగా సమానంగా ఉండేలా జిల్లాలను విభజించారు. వరంగల్ రూరల్‌లోని 5 మండలాలు హనుమకొండ జిల్లాలో కలిశాయి. దీంతో వరంగల్ రూరల్ జిల్లాలో ఉన్న శాయంపేట జెడ్పీటీసీ స్థానం నుంచి గెలిచిన గండ్ర జ్యోతి వరంగల్ రూరల్ జెడ్పీ చెర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఎల్కతుర్తి మండలం జెడ్పీటీసీ సభ్యుడిగా గెలిచిన డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్ వరంగల్ అర్బన్ చైర్మన్‌గా ఉన్నారు. జిల్లాల పునర్విభజనలో శాయంపేట మండలాన్ని హనుమకొండ జిల్లాలోకి చేర్చారు. దీంతో వరంగల్ రూరల్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న గండ్ర జ్యోతి హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చారు. దీంతో ఇద్దరు హనుమకొండ జిల్లాకు చెందిన వారయ్యారు.

త్వరలో హనుమకొండ, వరంగల్ జెడ్పీలు

హన్మకొండ: ప్రస్తుత పాలవర్గాల పదవీ కాలం పూర్తవుతుండడంతో వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లా ప్రజాపరిషత్‌ల స్థానంలో కొత్తగా.. హనుమకొండ, వరంగల్ జిల్లా ప్రజాపరిషత్‌లు ఏర్పాటు కానున్నాయి. గతంలో జిల్లా ప్రజాపరిషత్ ఎన్నికలు జరిగి పాలక మండళ్లు ఎన్నికైన తర్వాత వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలను పునర్విభజన చేసి హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈక్రమంలో పాలక మండళ్లు ఉండడంతో జిల్లా ప్రజాపరిషత్‌లను పునర్విభజన చేయడం సాధ్యం కాలేదు. ఇప్పుడు పాలక మండళ్ల పదవీ కాలం పూర్తి కానుండడంతో ఎలాంటి సమస్య తలెత్తదు. దీంతో హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్, వరంగల్ జిల్లా ప్రజాపరిషత్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈమేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి.

రెండు జిల్లా పరిషత్‌లు ఇలా..

- వరంగల్ రూరల్ జిల్లాలో 16 మండలాల్లో 5 మండలాలు, వరంగల్ అర్బన్ జిల్లాలోని ఏడు మండలాలు కలిసి హనుమకొండ జిల్లా పరిషత్‌గా ఏర్పాటు కానున్నాయి.
- జిల్లాల పునర్విభజన తర్వాత అప్పటి వరకు రూరల్ జిల్లాలో ఉన్న పరకాల, ఆత్మకూరు, శాయంపేట, దామెర, నడికూడ మండలాలు హనుమకొండలోకి చేర్చారు. వీటితో పాటు ధర్మసాగర్, వేలేరు, ఐనవోలు, హసన్‌పర్తి, కమలాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలు హనుమకొండ జెడ్పీ పరిధిలో ఉంటాయి.
- చెన్నారావుపేట, దుగ్గొండి, గీసుకొండ, ఖానాపురం, నల్లబెల్లి, నర్సంపేట, నెక్కొండ, పర్వతగిరి, రాయపర్తి, సంగెం, వర్ధన్నపేట మండలాలు వరంగల్ జిల్లా పరిషత్ పరిధిలో ఉంటాయి.
- హనుమకొండ జిల్లాలో 130 ఎంపీటీసీ స్థానాలు, 11 జెడ్పీటీసీ స్థానాలు, వరంగల్ జిల్లాలో 134 ఎంపీటీసీ స్థానాలు, 11 జెడ్పీటీసీ స్థానాలు ఉండనున్నాయి.

న్యూస్‌రీల్

ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి: డీఎంహెచ్‌ఓ

ఎంజీఎం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంహెచ్‌ఓ సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 నిబంధనలకు లోబడి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రతీ ప్రైవేట్ ఆస్పత్రి, స్కానింగ్, ఇమేజింగ్ సెంటర్లు ల్యాబ్ డయాగ్నోస్టిక్ సెంటర్లు తప్పనిసరిగా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ధరల పట్టిక బోర్డులను ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఆస్పత్రిలో డాక్టర్ల వివరాలు, సిబ్బంది వివరాల్ని ప్రదర్శించాలని తెలిపారు.

నేడు, రేపు స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 3, 4 తేదీల్లో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్ క్రీడల్లో 10 నుంచి 12 ఏళ్ల బాలబాలికలు, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్ క్రీడల్లో ప్రవేశాలకు 12 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులుగా తెలిపారు. ఎంపిక పరీక్షల్లో పాల్గొనే క్రీడాకారులు గుర్తింపు కలిగిన క్రీడా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో సాధించిన పతకాలు, ప్రాతినిధ్యం వహించిన సర్టిఫికెట్లు కలిగి ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు అథ్లెటిక్స్ కోచ్ శ్రీమాన్ 91828 54789, జిమ్నాస్టిక్స్ కోచ్ దేవిక 80995 93913, హ్యాండ్‌బాల్ కోచ్ విష్ణువర్ధన్ 73864 69301, స్విమ్మింగ్ కోచ్ నవీన్ 99123 55802, రెజ్లింగ్ కోచ్ రాజు 91828 54789 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం



విద్యారణ్యపురి: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి ఆరోపించారు. మంగళవారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి స్కూల్ విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలున్నాయన్నారు. వాటిల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణకు ఎంఈఓలను నియమించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు రాచకొండ రంజిత్, బాధ్యులు మహేశ్, అర్జున్, పవన్ తదితరులు పాల్గొన్నారు. డీఈఓ కార్యాలయం సూపరింటెండెంట్ శైలజను డీఈఓ ఆందోళన చేస్తున్న స్థలానికి పంపించారు. దీంతో పీడీఎస్‌యూ నాయకులు సూపరింటెండెంట్ శైలజకు వినతిపత్రం ఇచ్చారు.

మిగిలిన వేకెన్సీలకు పదోన్నతులు?

విద్యారణ్యపురి: ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఇటీవల స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతుల ప్రక్రియ నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో కొందరు టీచర్లు ఎస్జీటీగా ఉండి పీఎస్‌హెచ్‌ఎంగాను వివిధ సబ్జెక్టుల్లో రెండు, మూడు పోస్టుల్లో పదోన్నతులు పొందారు. అందులో ఒక పదోన్నతిలో జాయిన్ అయ్యారు. అలా మిగిలిన పదోన్నతుల వేకెన్సీల్లో సీనియార్టీ జాబితా ప్రకారం.. పదోన్నతులు కల్పించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈమేరకు హనుమకొండ జిల్లాలో 39 పోస్టుల్లో పదోన్నతుల కల్పనకు సంబంధించి ఎస్జీటీల సీనియార్టీ జాబితాను రూపొందించి మంగళవారం వెల్లడించారు. అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. వరంగల్ జిల్లాలోనూ సుమారు 40 వరకు మిగిలిన వేకెన్సీలున్నట్లు సమాచారం.

రిలీవ్ చేయాలి..

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో విద్యార్థులు అసలే లేని పాఠశాలలు (జీరో స్కూల్స్) కూడా ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 33 ఉండగా.. వరంగల్ జిల్లాలో 125 వరకు ఉన్నాయి. అందులో పని చేస్తున్న టీచర్లను ఏటా వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద విద్యార్థులు ఉన్న చోట పాఠశాలలకు పంపిస్తున్నారు. ఈ ఎస్జీటీ కేడర్ బదిలీల్లో ఆయా జీరో స్కూల్‌లో టీచర్ అయి ఉండి బదిలీల ప్రక్రియలో బదిలీ అయితే వారిని తప్పనిసరిగా ఆపాఠశాల నుంచి రిలీవ్ చేయాలని ఆయా జిల్లాల డీఈఓలు ఎంఈఓలను ఆదేశించారు. ఈమేరకు అలాంటి ఉపాధ్యాయులను రిలీవ్ చేస్తున్నట్లు సమాచారం.

ఎస్సారెస్పీ కాల్వ కబ్జాదారులకు నోటీసులు



హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

శాయంపేట: మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాల్వ కబ్జాదారులకు కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు 32 మందికి పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా ఏబీఎస్‌ఎఫ్, డీవైఎఫ్ఐ నాయకులు మంగళవారం కలెక్టర్ ప్రావీణ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కళ్యాణ్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేశ్ మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ కాల్వ కబ్జాకు గురైందని మే 24న గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేయగా.. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టి కబ్జా చేసిన 32 మందికి నోటీసులు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కబ్జా చేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఎస్సారెస్పీ కాల్వను సరిచేసి రైతులకు సాగునీరందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మారేపల్లి సుధీర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఎకరాకు సాగు నీరందిస్తా..

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ఎంపీటీసీల వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ సన్మానిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు: మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని, నియోజకవర్గ పరిధి ప్రతీ ఎకరాకు సాగు నీరందిస్తానని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గురుకుల, కస్తూర్బా గాంధీ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని తరగతి, వంట గదుల్ని, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలోని వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలకు ప్రహరీ నిర్మాణం, ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో 46 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, ఇద్దరికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీల వీడ్కోలు సమావేశంలో పాల్గొని వారిని శాలువాలతో సత్కరించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మండలానికి గతంలో మంజూరైన రూ.104 కోట్ల ఎత్తిపోతల పథకాన్ని 9 నెలల్లో పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ నాటికి ప్రతీ ఎకరానికి సాగునీరందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత, వైస్ ఎంపీపీ సంపత్, తహసీల్దార్ కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, కో–ఆప్షన్ సభ్యుడు జానీ, నాయకులు మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ రాజేశ్వర్‌రెడ్డి, కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి, మండల యూత్ అధ్యక్షుడు హుస్సేన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

వరంగల్ డీఈఓ వాసంతి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

కాశీబుగ్గ సెంటర్: సుస్థిరమైన భవిష్యత్ కోసం పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వరంగల్ డీఈఓ వాసంతి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఎన్జీసీ (తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్), విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కవితలు, పోస్టర్ తయారీ పోటీలను వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 167 మంది విద్యార్థులు ,42 మంది ఎన్జీసీ టీచర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఈఓ వాసంతి మాట్లాడుతూ ఈ సంవత్సరం 'భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకోగలగడం' అనే శీర్షికలతో కళాత్మకంగా పోస్టర్లు, సందేశాత్మక కవితలను రూపొందించారన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఈఓ బహుమతులను అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, న్యాయనిర్ణేతలు శ్రీనివాసులు, సుమలత, ఈశ్వరయ్య, రాజు, వాసు, శ్రవణ్, పరమేశ్వర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ ఆఫీస్‌కు నోటీసులు

- మూడు రోజుల్లో పూర్తి స్థాయి వివరాలివ్వాలి
- బల్దియా కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్

వరంగల్ అర్బన్: హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ ఆఫీస్‌కు బల్దియా కాజీపేట డిప్యూటీ కమిషనర్ గోడిశాల రవీందర్‌గౌడ్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. మూడ్రోజుల్లోగా స్థలం, భవన నిర్మాణ అనుమతుల పత్రాలను సమర్పించాలని సూచించారు. లేకపోతే మున్సిపల్ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా కలకలం రేపిన ఈవిషయమై వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ బాలసముద్రంలో ప్రజాప్రయోజనాల కోసం వదిలిన స్థలంలో నాలుగేళ్ల క్రితం బీఆర్‌ఎస్ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. బల్దియా అధికారులు గతంలో బీఆర్‌ఎస్‌కు రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. కానీ.. ఎలాంటి స్పందన రాలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఈనేపథ్యంలో ఇటీవల వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పార్కు స్థలంలో బీఆర్‌ఎస్ కార్యాలయ భవన నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. కలెక్టర్‌కు లేఖ రాశారు. కలెక్టర్ నుంచి ఆర్డీఓ ద్వారా బల్దియాకు లేఖలు సమర్పించారు. ఈక్రమంలో బల్దియా డిప్యూటీ కమిషనర్ గోడిశాల రవీందర్ మూడోసారి బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పేరిట నోటీసులు జారీ చేశారు. లేఔట్ స్థలానికి సంబంధించిన కేటాయింపులు, భవన నిర్మాణ అనుమతి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. లేకపోతే పార్కు స్థలంలో అనుమతులు లేకుండా నిర్మించారని కూల్చివేసేందుకు బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

కమిషనరేట్‌లో పోలీస్ అధికారుల బదిలీ



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పలువురు ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ.. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్లలో ఆర్.సంతోశ్ పీసీఆర్ నుంచి ఆత్మకూరు, వి.క్రాంతికుమార్ ఆత్మకూరు నుంచి పరకాల, డి.రవిరాజు పరకాల నుంచి వీఆర్ వరంగల్, జి.బాబులాల్ వీఆర్ వరంగల్ నుంచి గీసుకొండ, ఎల్.పవన్‌కుమార్ గీసుకొండ నుంచి టాస్క్‌ఫోర్స్, ఎ.సువర్ణ ఏఆర్ వరంగల్ నుంచి సుబేదారి మహిళా పోలీస్ స్టేషన్, ఎస్.కరుణాకర్ సుబేదారి మహిళా పోలీస్ స్టేషన్ నుంచి సీసీఆర్‌బీ, కె.రామకృష్ణ వీఆర్ వరంగల్ నుంచి వరంగల్ ట్రాఫిక్, కె.శ్రీధర్ వరంగల్ ట్రాఫిక్ నుంచి వరంగల్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. సబ్ ఇన్‌స్పెక్టర్లలో ఎస్.వెంకన్న గీసుకొండ నుంచి వీఆర్ వరంగల్, జి.రాజేశ్‌రెడ్డి ఆత్మకూరు నుంచి వీఆర్ వరంగల్, ఎన్.చెన్నకేశవులు దేవరుప్పుల నుంచి జనగామ, పి.శ్రీనివాస్ హనుమకొండ నుంచి వీఆర్ వరంగల్, జి.అనిల్‌కుమార్ ఐనవోలు నుంచి వీఆర్ వరంగల్‌కు బదిలీ చేస్తూ.. సీపీ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

ఆగని ఆర్పీల అవినీతి బాగోతం


వరంగల్ అర్బన్: బినామీ సంఘాలను సృష్టించి బ్యాంకు సిబ్బందితో జత కట్టి పెద్ద ఎత్తున సొమ్ము కాజేసిన ఘటనలు వరంగల్ మెప్మాలో చోటు చేసుకున్నాయి. కానీ.. మహిళా సంఘాలకు ఏమాత్రం సంబంధం లేకుండా బ్యాంకుల నుంచి రుణం పొందిన తీరుపై మహిళలు లబోదిబోమంటున్నారు. తాజాగా.. బల్దియా పరిధి 14వ డివిజన్ 21 మహిళా సంఘాలకు సంబంధించిన సభ్యులకు ఏమాత్రం సంబంధం లేకుండా ఓ ఆర్పీ బ్యాంకర్లతో జత కట్టి రూ.లక్షల్లో సొమ్ము సొంతానికి వాడుకున్నట్లు సమాచారం. ఈవిషయంపై బ్యాంకర్లు రుణాలకు సంబంధించిన సొమ్ము చెల్లించాలని నోటీసులు జారీ చేసేంత వరకు సంఘాల సభ్యులకు తెలియదు. బ్యాంకర్ల నోటీసులతో పొదుపు సంఘాల్లోని సభ్యులు తాము తీసుకోని సొమ్ముకు నోటీసులు ఏంటని లబోదిబోమంటున్నారు. వరంగల్ బల్దియాలోని కొంత మంది ఉద్యోగులు ఆర్పీలు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా రుణాల పేరిట కమీషన్లను వసూలు చేస్తున్నారు. బ్యాంకర్లతో జతకట్టి సభ్యులను ఇబ్బంది పెడుతున్నారనే విమర్శలున్నాయి. ఆరేళ్ల క్రితం బినామీ మహిళా సంఘాలను సృష్టించి బ్యాంకర్లను నమ్మబలికించి పెద్ద ఎత్తున సొమ్ము కాజేయడంతో ఇద్దరు సీఓలు, నలుగురు ఆర్పీలను ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగించారు. నెలనెలా వేతనం తీసుకుంటున్న సీఓలు, ఆర్పీలు మహిళల పేరిట సొమ్ము కాజేయడంతో సంఘాల లక్ష్యం నీరుగారుతోంది. మెప్మాలో రుణాల పేరిట కమీషన్ల బాగోతంపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

డిగ్రీకి నో డిమాండ్!

కళాశాలల్లో చేరేందుకు విద్యార్థుల అనాసక్తి

- కేయూ పరిధిలో మొత్తం 261 డిగ్రీ కళాశాలలు
- ఇప్పటికే 'దోస్త్' ద్వారా రెండు దశల్లో సీట్ల భర్తీ
- 1,01,610 సీట్లకు 18,251 భర్తీ
- మూడో దశ, ప్రత్యేక దశపైనే ఆశలు
- ఆందోళన చెందుతున్న అధ్యాపకులు

డిగ్రీ ఫస్టియర్‌లో రెండు దశల అడ్మిషన్ల ప్రక్రియ తర్వాత భర్తీ అయిన సీట్ల వివరాలు



కేయూ క్యాంపస్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లకు విద్యార్థులు ఇష్టపడడం లేదు. కాకతీయ యూనివర్సిటీ పరిధి కళాశాలల్లో 1,01,610 సీట్లకుగాను రెండు దశల్లో 18,251 భర్తీ అయ్యాయి. ఈ సంఖ్య చూస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. పేరెన్నికగన్న కళాశాలలు మినహాయిస్తే మిగతా వాటిలో అంతంతమాత్రంగానే సీట్లు భర్తీకావడంతో అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, అటానమస్ డిగ్రీ కళాశాలలు 262 ఉన్నాయి. వీటిలో బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ తదితర కోర్సుల్లో కంప్యూటర్ సైన్స్ కాంబినేషన్లతోపాటు లైఫ్ సైన్సెస్ కోర్సులు కూడా కొనసాగుతున్నాయి. ఈ విద్యాసంవత్సరం 2024–2025లో వివిధ కోర్సుల్లో ఇప్పటివరకు రెండు దశల్లో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) ద్వారా సీట్ల కేటాయింపులు జరిగాయి.

1,01,610 సీట్లకు..

మొత్తం డిగ్రీ కళాశాలల్లో 1,01,610 సీట్లు ఉన్నాయి. మొదటి దశలో 16, 524 సీట్లు కేటాయించగా 11,544మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. రెండోదశలో 8,498 సీట్లకుగాను 6,707మంది ప్రవేశాలు పొందారు. 18,251 సీట్లు భర్తీ అయ్యాయి.

కొనసాగుతున్న మూడో దశ

మూడో దశలో దోస్త్ ద్వారా విద్యార్థులు ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారంతో ముగిసింది. శుక్రవారంతో వెబ్ ఆప్షన్ల ప్రక్రియ కూడా ముగియనుంది. అనంతరం సీట్ల కేటాయింపు ఉంటుంది. ఈమేరకు సీట్లు భర్తీ అవుతాయా అనేది వేచి చూడాలి. ఆ తర్వాత స్పెషల్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుంది. ఈవిద్యాసంవత్సరంలో సగం సీట్లు కూడా భర్తీ అయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులపైనే..

డిగ్రీలో ఇప్పుడున్న కోర్సులతోపాటు కొత్తవి ప్రవేశపెట్టినప్పటికీ చేరేందుకు విద్యార్థులు అంతగా ఆసక్తి కనబర్చడం లేదు. ఈ రెండు దశల్లో జరిగిన అడ్మిషన్లలో కూడా ఎక్కువగా బీకాం, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ, బీజెడ్‌సీ, బీఎస్సీ ఎంపీసీ కంప్యూటర్స్ కోర్సులపైనే ఆసక్తి చూపించారు. ఇంటర్ ఉత్తీర్ణత కాగానే ఎక్కువశాతం మంది విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులకు వెళ్తుండడంతో ఈ పరిస్థితి నెలకొందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేయూ పరిధిలో గురుకుల డిగ్రీ కళాశాలలు 30వరకు ఉన్నాయి. అవి సొంతంగానే అడ్మిషన్లు చేసుకుంటున్నాయి. గురుకులాల ప్రభావం కొంత ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలపై పడింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనైతే తక్కువగా అడ్మిషన్లు అవుతున్నాయి. ఇది అధ్యాపకుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈసారి ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం తగ్గడం, గత నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వచ్చాయి. అందులో ఉత్తీర్ణులైనవారిలో ఎంతమంది డిగ్రీకోర్సుల్లో చేరుతారనేది వేచి చూడాల్సిందే.

ఇంజనీరింగ్‌లో అడ్మిషన్ల ప్రక్రియ తర్వాతే..

ఇంటర్ ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఎక్కువ మంది ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు చూస్తున్నారు. ఇంకా ఇంజనీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఈ నెల 4వ తేదీనుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ జరగనుందని భావిస్తున్నారు. అందులో సీటు లభిస్తుందనుకునే వారు డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేయడం లేదని సమాచారం. మరోవైపు ఇంటర్ బైపీసీ చేసిన విద్యార్థుల్లో కొందరు మెడిసిన్‌లో ప్రవేశాల కోసం చూస్తున్నారు. ఆయా ప్రవేశాలు ఎప్పుడు అవుతాయో వేచి చూడాల్సిందే. ఇంజనీరింగ్‌లో ప్రవేశాలు పూర్తయితే అందులో సీట్లు రానివారు డిగ్రీ కోర్సుల్లో చేరే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

ఈ నెల 15నుంచి డిగ్రీ ప్రథమ విద్యార్థులకు తరగతులు

డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం తరగతులు ఈనెల 15నుంచి ప్రారంభంకానున్నట్లు సమాచారం. మూడో దశ సీట్ల భర్తీ ప్రక్రియ తరువాత తరగతులు నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

10న జేఎల్ఎం అభ్యర్థులకు పోల్ టెస్ట్

హన్మకొండ: జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌లో మిగిలిపోయిన పోస్టులను భర్తీ చేసేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 10న పోల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ మంగళవారం తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు హనుమకొండ పెద్దమ్మగడ్డలోని విద్యుత్ శిక్షణ కేంద్రంలో ఈ నెల 10న ఉదయం 9 గంటలకు నిర్వహించే విద్యుత్ స్తంభం ఎక్కే టెస్ట్‌కు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికేట్స్‌తో రావాలని కోరారు. అర్హులైన అభ్యర్థులకు ఇప్పటికే ఉత్తరాలు పంపామని, జాబితా సర్కిల్ కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు వివరించారు. ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

4.50కేజీల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్ట్

గార్ల: పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఘటన సోమవారం రాత్రి ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. గార్ల బయ్యారం సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా గార్ల మండలం అంజనాపురం గ్రామానికి చెందిన ఇస్లావత్ చిన్న, మాలోత్ వినోద్‌కుమార్ 4.50కేజీల గంజాయిని విక్రయించేందుకు బైక్‌పై తరలిస్తుండగా.. ఇందిరానగర్‌తండా సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. ఈమేరకు ఇద్దరు నిందితులను విచారించగా, గంజాయి తరలింపులో ఓ ప్రభుత్వ ఉద్యోగి హస్తం ఉన్నట్లు నిందితులు పేర్కొన్నారు. ఈమేరకు ఇద్దరు నిందితులతోపాటు, ప్రభుత్వ ఉద్యోగిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం మహబూబాబాద్ కోర్టులో హాజరుపర్చి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

గంజాయి నిందితుల రిమాండ్

దామెర : గంజాయి కేసులో పట్టుబడ్డ నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అక్రమంగా గంజాయి రవాణా కేసులో ఐదుగురిలో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ చేయగా, మిగిలిన ఇద్దరు ఖమ్మం జిల్లాకు చెందిన మహ్మద్ అఫ్రోజ్, తమ్మిశెట్టి ఆనంద్‌ను మంగళవారం వరంగల్‌లోని పోచమ్మ మైదాన్‌లో పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిబంధనల మేరకే పదోన్నతి

హన్మకొండ : టీజీఎస్ ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో నిబంధనల మేరకే పదోన్నతి కల్పిస్తున్నామని ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపు మేనేజర్ సుగుణాకర్ తెలిపారు. రెగ్యులేషన్ రూల్స్ ప్రకారం లీడింగ్ హ్యాండ్ పదోన్నతి పొందడానికి కచ్చితంగా డిపార్ట్‌మెంట్ పరీక్ష ఉత్తీర్ణులు కావాలని ఆయన పేర్కొన్నారు. 50 ఏళ్ల వయస్సు మినహాయింపు లేదని వివరించారు. విజిలెన్స్ విచారణలో ఒకే హ్యాండ్ రైటింగ్‌తో వల్కనైజర్లు జవాబు పత్రాలు ఉన్నాయనడంలో వాస్తవం లేదని తేలిందని చెప్పారు. కోర్టు ఉత్తర్వుల మేరకు తాత్కాలికంగా పదోన్నతులు నిలిపివేసినట్లు తెలిపారు.

వెలగని వీధిదీపం

ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు
- ప్రభుత్వం నుంచి నిలిచిపోయిన చెల్లింపులు
- వరంగల్, జనగామ జిల్లాల్లో చీకట్లోనే పలుగ్రామాలు

హన్మకొండ: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ బల్బులు వెలగడంలేదు. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణ బాధ్యతకూడా ఆ సంస్థదే.. కానీ, వీధి దీపాల సరఫరా, బిగింపునకు సంబంధించిన బిల్లులు ఇప్పటి వరకు ప్రభుత్వం ఈ సంస్థకు చెల్లించలేదని సమాచారం. దీంతోపాటు నిర్వహణకు జిల్లా స్థాయిలో కో ఆర్డినేటర్, మండల స్థాయిలో సైట్ ఇంజనీర్‌తోపాటు ఎలక్ట్రిషియన్స్‌ను నియమించారు. అయితే ఎల్ఈడీ వీధిలైట్లు బిగింపు బిల్లులు రాకపోవడంతోపాటు ప్రతి నెలా నిర్వహణ ఖర్చులు చెల్లించకపోవడంతో సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో జిల్లా స్థాయిలో నియమించిన కో ఆర్డినేటర్లు, మండల స్థాయిలో నియమించిన సైట్ ఇంజనీర్లు, సిబ్బంది జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయమార్గాలు చూసుకున్నారు. దీంతో వీధి దీపాల నిర్వహణను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సాధారణ బల్బులతో విద్యుత్ బిల్లులు తడిసిమోపెడు అయ్యేవి. నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లించలేక చతికిలపడ్డాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ ఆదాతోపాటు వెలుతురు అధికంగా ఇచ్చే ఎల్ఈడీ బల్బుల ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఎల్ఈడీ వీధి దీపాలు బిగించే పర్యవేక్షణ బాధ్యతను తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్కో) చేపట్టింది. ఎల్ఈడీ వీధి దీపాల సరఫరాకు ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్‌తో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థ వీధి దీపాల సరఫరా బిగింపు కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్రంలో ముందుగా వరంగల్ జిల్లాలోని పర్వతగిరి, రాయపర్తి మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఈబల్బులు ఏర్పాటు చేశారు. కొనసాగింపుగా వరంగల్, జనగామ జిల్లాను ఎంపిక చేశారు. వరంగల్ జిల్లాలో రూ.7కోట్ల వ్యయం, జనగామ జిల్లాలో రూ.6కోట్ల వ్యయం అంచనాతో ఎల్ఈడీ వీధి దీపాలు బిగించాలని ప్రణాళిక రూపొందించుకుని ఏర్పాటు చేశారు. కానీ, నిర్వహణ లేకపోవడంతో టైమ్ మారడంతో కొన్ని చోట్ల పగలు వెలుగుతూ రాత్రి వెలుగడం లేదు. చాలా గ్రామాల్లో పూర్తిగా వెలుగడం లేదు. ఎంపీడీఓలు, జిల్లా పంచాయతీ అధికారులకు చెప్పినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

కానరాని జిల్లా కోఆర్డినేటర్లు

ప్రత్యేకంగా నియమితులైన జిల్లా కో ఆర్డినేటర్లు వీధిదీపాల పనితీరును జీపీఎస్ ద్వారా పర్యవేక్షిస్తూ సమస్యను సంబంధిత ఎలక్ట్రిషియన్‌కు సమాచారం అందించి బాగు చేయించాల్సి ఉంటుంది. అయితే జనగామ, వరంగల్ జిల్లా పంచాయతీ కార్యాలయాల్లో గత నాలుగు నెలలుగా ఈ కో ఆర్డినేటర్లు కానరావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. వీధి దీపాల నిర్వహణ, మరమ్మతుల కోసం మండలం సైట్ ఇంజనీర్, ఎలక్ట్రిషియన్‌ను నియమించినా ఇప్పుడు వీరు కనిపించడం లేదు. దీంతో ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణను పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి. జిల్లా పంచాయతీ అధికారులను అడిగితే రెడ్కో వారిని సంప్రదించాలని, రెడ్కో అధికారులను అడిగితే జిల్లా పంచాయతీ అధికారులు చూసుకుంటున్నారని సమాధానం చెబుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. వీధి లైట్లు బిగింపు బిల్లులు ఏమో కాని ప్రతి నెలా చెల్లించాల్సిన నిర్వహణ ఖర్చులు చెల్లించకపోవడంతో సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో వారు విధుల నుంచి తప్పుకున్నారని పేరు చెప్పడానికి ముందుకు రాని ఓ అధికారి చెప్పడం కొసమెరుపు.



ఏర్పాటు చేసిన వీధిదీపాల వివరాలు ఇలా..

జనగామ జిల్లాలో	
గ్రామ పంచాయతీలు	281
ఏర్పాటు చేసిన గ్రామాలు	269
18 వాట్స్	43,447
35 వాట్స్	7,320
70వాట్స్	381
110 వాట్స్	249
190 వాట్స్	63
మానిటరింగ్ సిస్టమ్ బాక్స్‌లు	1,201

వరంగల్ జిల్లాలో..	
గ్రామపంచాయతీలు	323
ఏర్పాటు చేసిన గ్రామాలు	317
18వాట్స్	4,045
32వాట్స్	1,894
35 వాట్స్	4,930
70 వాట్స్	430
75 వాట్స్	126
190 వాట్స్	34
సీఎంఎస్ బాక్స్‌లు	1,490

అలైడ్ హెల్త్ సైన్స్ సమస్యలు పరిష్కరించాలి



యూనివర్సిటీ ఎదుట నినాదాలు చేస్తున్న విద్యార్థులు

- హెల్త్ యూనివర్సిటీని ముట్టడించిన విద్యార్థులు

ఎంజీఎం : అలైడ్ హెల్త్ సైన్స్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 700 మంది విద్యార్థులు మంగళవారం కాళోజీ ఆరోగ్య యూనివర్సిటీని ముట్టడించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ గతేడాది రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అలైడ్ హెల్త్ సైన్స్ కోర్సు చదివేందుకు అరకొర వసతులు, బోధన సిబ్బంది లేకపోవడం, కనీసం సిలబస్‌ను సైతం చివరిలో అందించడం వల్ల 97 శాతం మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని ఆరోపించారు. హెల్త్ యూనివర్సిటీ వీసీ స్పందించి విద్యార్థులకు సరైన వసతులు, అకడమిక్ క్యాలెండర్ కేటాయించి సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత 50 శాతం మార్కులు కాకుండా 40కి తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థుల ప్రతినిధి బృందం రిజిస్ట్రార్‌ను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వివరించారు.

తెలంగాణ ఉద్యమకారుడి ఆత్మహత్య



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న చైర్‌పర్సన్ జమున, నాయకులు

జనగామ: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియాకు చెందిన ఉల్లెంగుల కృష్ణ సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరోనా సమయంలో తన భార్య అకాల మరణంతో మనస్తాపం చెంది, అనారోగ్యానికి గురైన కృష్ణ సోమవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, 13వ వార్డు బీఆర్ఎస్ నాయకులు మల్లిగారి రాజు, మామిడాల రాజు, ఉల్లెంగుల సందీప్, వంగ ప్రణీరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించి, కన్నీటి పర్యంతమయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రూ.10వేలతోపాటు పలువురు నేతలు కలిపి రూ.25వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జనగామలో భారీ దొంగతనం

- బంగారు, వెండి ఆభరణాల అపహరణ



చోరీ ఘటనపై ఆరా తీస్తున్న డీసీపీ, పక్కన ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

జనగామ: తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడిన దుండగులు బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదు ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బీరప్పగడ్డకు చెందిన గుంటి ప్రేమలత పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన సుమారు 11తులాలకు పైగా బంగారు ఆభరణాలు, 25తులాల వెండిని విడిపించుకుని ఇంటికి తీసుకొచ్చింది. అనారోగ్యానికి గురి కావడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకునేందుకు గత నెల 25న హైదరాబాద్‌లోని తన కుమారుడు సాయి రాఘవ వద్దకు వెళ్లింది. వారం రోజులుగా ఇంటికి తాళం వేసి ఉన్న విషయాన్ని గుర్తించిన గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి ప్లాన్ చేశారు. అర్ధరాత్రి ప్రేమలత ఇంటి పక్కనే ఉన్న ఇళ్ల డోర్లకు బయట నుంచి బేడాలు వేసి ప్రేమలత ఇంట్లోకి చొరబడ్డారు. తెల్లవారు జామున పక్క ఇంటి వ్యక్తి తలుపులు తీసేందుకు ప్రయత్నం చేయగా.. రాకపోవడంతో తన సోదరుడికి ఫోన్ ద్వారా తెలిపారు. వారి ఇంటితోపాటు మరో నలుగురి ఇళ్లకు ఇలాగే లాక్ చేసి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. ఇంటి ఎదురుగా ఉన్న ఓ వ్యక్తికి ఫోన్ చేసి సంఘటన గురించి వివరించి.. తలుపులకు ఉన్న బేడాలను తీయాలని కోరారు. వారు బయటకు వచ్చి చూసే సరికి.. ప్రేమలత ఇంటి డోర్ తెరిచి ఉండడంతో వెంటనే ఫోన్ చేసి విషయం చెప్పారు. అప్పటికే దొంగలు ప్రేమలత ఇంట్లో సుమారు రూ.10లక్షల విలువ చేసే 11తులాల బంగారం, 25తులాల వెండి ఆభరణాలు, రూ.15వేల నగదు ఎత్తుకెళ్లారు. ఎస్సై భరత్, క్లూజ్ టీంతో వెళ్లి వివరాలు సేకరించారు. సీఐ రఘుపతిరెడ్డితో కలిసి డీసీపీ రాజమహేంద్రనాయక్ చోరీ జరిగిన ఇంటికి వెళ్లి దొంగతనంపై ఆరా తీశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అంతరాష్ట్ర దొంగల ముఠానా లేక.. లోకల్‌గా ఎవరైనా చోరీకి పాల్పడ్డారా.. అనే కోణంలో పోలీసులు విచారణ ప్రారంభించారు.

ఏసీబీ డీజీపీని కలిసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

- హైవే భూ సేకరణ పరిహారం అవినీతిపై విచారణ జరపాలని వినతి



సీవీ ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, వరంగల్: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం భీమారం పరిధిలో జాతీయ రహదారి భూసేకరణ పరిహారం చెల్లింపులో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు.. ఏసీబీ డీజీపీ సీవీఆర్ ఆనంద్‌ని మంగళవారం సాయంత్రం కలిసినట్టు తెలిసింది. భువనగిరి – ఆరెపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా హసన్‌పర్తి మండలం భీమారం – చింతగట్టు సమీపంలో భూసేకరణలో భాగంగా ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి రూ.9.19 కోట్లు అప్పనంగా చెల్లించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్లాట్లు చేసి విక్రయించిన తర్వాత ఆ ప్లాట్లకు భూసేకరణలో భాగంగా పరిహారం చెల్లించిన వైనం కుంభకోణంగా మారింది. అప్పుడున్న తహసీల్దార్, ఆర్డీఓ తదితరులు సుమారు రూ.9.19 కోట్లను అప్పనంగా రియల్ ఎస్టేట్ వ్యాపారికి చెల్లించినట్లు వెల్లడైంది. ఈ విషయమై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. భూసేకరణలో జరిగిన అక్రమాలపై స్పందించిన సీఎంఓ కార్యాలయం ఆరా తీసినట్లు సమాచారం. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఏసీబీ డీజీపీ సీవీ ఆనంద్‌ని కలవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

దర్శనానికి వెళ్తూ.. మృత్యుఒడికి

- కారు ఢీకొని తల్లి మృతి, కుమారుడికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో మల్లమ్మ, శివలింగం

చిల్పూరు: ఐనవోలు మల్లన్నను దర్శించుకునేందుకు బైక్‌పై వెళ్తున్న తల్లీకుమారులను గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో తల్లి మృతి చెందాగా.. కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కన్నె మల్లమ్మ (60) ఐనవోలు దేవున్ని దర్శించుకునేందుకు మంగళవారం ఉదయం కుమారుడు శివలింగంతో ద్విచక్రవాహనంపై బయలు దేరారు. చిన్నపెండ్యాల గ్రామ సమీపంలోకి రాగానే వరంగల్– హైదరాబాదు జాతీయ రహదారిపై గుర్తు తెలియని కారు ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీ కొట్టడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మల్లమ్మ మృతి చెందింది. మృతురాలి పెద్ద కుమారుడు కన్నె రాజలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

'సీతారామ'తో గోదావరి నీరందిస్తాం




సీతారామ అక్విడక్ట్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

డోర్నకల్: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా మహబూబాబాద్, ఖమ్మం ప్రాంతాలకు గోదావరి నీరందిస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మానుకోట జిల్లా డోర్నకల్ మండలంలో చాప్లాతండా సమీపంలో నిర్మించిన సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అక్విడక్ట్‌తోపాటు, తొడేళ్లగూడెం గ్రామ సమీపంలో జరుగుతున్న ప్రాజెక్ట్ లింక్ కెనాల్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రణాళికాబద్ధంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. మొదటి లిఫ్ట్‌లో వెట్‌రన్ నాలుగు రోజుల క్రితం ట్రయల్ నిర్వహించామని, పాలేరు రిజార్వాయర్ వరకు నీరు తరలించేందుకు మధ్యలో కొన్ని పెండింగ్ పనులకు యుద్ధప్రాతిపదిక టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టులో సుమారు 1.55లక్షల ఎకరాలకు, మీడియం ప్రాజెక్టులైన వైరా, లంకసాగర్ ఆయకట్టు పరిధిలోని చెరువులను లింక్ కెనాల్ ద్వారా అనుసంధానం చేసి ఆగస్టు 15లోగా రెండు పంటలకు నీరందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్ట్ పరిధిలో 10టీఎంసీ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తామని తెలిపారు. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ రెండు నెలల్లో చెస్తామన్నారు. ఆరు గ్యారంటీలను విడతలవారీగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువతను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓ అలివేలు, అదనపు ఎస్పీ తిరుపతిరావు అధికారులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం

చోరీలకు పాల్పడ్డ దొంగ అరెస్టు
- రూ.9 లక్షల విలువైన బంగారం, రూ.2లక్షల నగదు స్వాధీనం
- మట్టెవాడ ఏసీపీ నందిరాం నాయక్



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

రామన్నపేట : తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడ్డ దొంగను అరెస్ట్ చేసినట్లు మట్టెవాడ ఏసీపీ నందిరాం నాయక్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ బస్టాండ్‌లో మహిళ బ్యాగ్‌ను దొంగలించడంతోపాటు తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డ దొంగను అరెస్టు చేసి నిందితుడి నుంచి రూ.9లక్షల విలువైన బంగారం, రూ.లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు నందిరాం నాయక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా పాలెం మండలం రామచంద్ర పాలెం గ్రామానికి చెందిన కనుక రాజబాబు, మరో ఇద్దరితో కలిసి యలమంచిలి, నర్సీపట్నం, చోడవరంలో సుమారు 20కిపైగా దొంగతనాలకు పాల్పడ్డారు. జైలు నుంచి బయటకు వచ్చిన అతను మద్యం, పేకాటకు బానిసై దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం పిడుగురాళ్ల టౌన్ కిరాణం షాపులో దొంగతనానికి యత్నిస్తుండగా స్థానికులు గుర్తించి చితకబాది రైలు ఎక్కించి పంపించి వేశారు. ఈ క్రమంలో ట్రెయిన్ టికెట్ లేదని టీటీ వరంగల్ స్టేషన్‌లో దింపివేశాడు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో దిగిన రాజబాబు బస్టాండ్‌లో ఓ మహిళ బ్యాగ్‌ను దొంగలించి, అందులోని రెండున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లాడు. అనంతరం కాశిబుగ్గలోని వివేకానంద కాలనీలో అర్ధరాత్రి ఇంటి గేటుకు తాళం వేసి ఉన్న విషయాన్ని గమనించి రాడ్డుతో తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. బెడ్రూంలో ఉన్న 10 తులాల వెండి పట్టీలు, రూ.50 వేల నగదును దోచుకెళ్లాడు. అలాగే వివేకానంద కాలనీలో ఓ ఇంట్లో రూ.5లక్షల నగదుతో పాటు 10తులాల బంగారం ఎత్తుకెళ్లాడు. దొంగలించిన బంగారం, నగదుతో సొంతూరికి వెళ్లి.. బంగారం విక్రయించేందుకు మళ్లీ హైదరాబాద్‌కు వెళ్తుండగా వరంగల్ బస్టాండ్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి రూ.9 లక్షల విలువైన బంగారం, 10 తులాల వెండి, రూ. 2లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దొంగను పట్టుకునేందుకు కృషి చేసిన ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్సై వెంకన్న, క్రైం పార్టీ బృందం రవీందర్‌రెడ్డి, శివ, కానిస్టేబుళ్లను ఏసీపీ అభినందించి, రివార్డును సైతం అందించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి


ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా వేర్వేరు కారణాలతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

రఘునాథపల్లి: ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు కింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి– ఇప్పగూడెం రైల్వే స్టేషన్ మధ్య గోవర్ధనగిరి సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ పున్నమితోటకు చెందిన రెడ్డి నాగేశ్వర్‌రావు (34) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇంటికి వెళ్లేందుకు మంగళవారం ఉదయం గుర్తు తెలియని రైలులో విజయవాడకు ప్రయాణిస్తుండగా.. గోవర్ధనగిరి సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి మృతదేహాన్ని పరిశీలించి డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రి మార్చురికి తరలించి భద్ర పరిచామని పోలీసులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి పడి వ్యక్తి ..



సాయిలు (ఫైల్)

రాయపర్తి: టూవీలర్ అదుపు తప్పి గుంతలో పడడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని పోతిరెడ్డిపల్లి శివారులో సోమవారం రాత్రి 11గంటలకు చోటు చేసుకుంది. ఎస్సై వడ్డె సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిర్మలాయపల్లి గ్రామానికి చెందిన బండి సాయిలు(40) సోమవారం జనగామ జిల్లా కొడకండ్ల మండలం అవుతాపురం గ్రామంలో తన బంధువు దహన సంస్కారాలకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులో సాయిలు ప్రయాణిస్తున్న టూవీలర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో సాయిలు అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిలు కుమారుడు హరీశ్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీటిలో పడి వ్యక్తి..



శివ మృతదేహం

చెన్నారావుపేట: రోడ్డు డివైడర్ మధ్యలో నిలిచిన వర్షపు నీటిలో పడి ఒకరు మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన వైనాల శివ(30) తన తల్లి కోమలతో కలిసి మండల కేంద్రంలో కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూమాదిరిగానే సోమవారం రాత్రి తన తల్లితో కలిసి కూరగాయలు విక్రయించాడు. అనంతరం మద్యం సేవించి మండల కేంద్రంలోని సిద్దేశ్వరాలయం ఎదుట ఉన్న డివైడర్‌పై సెల్‌ఫోన్ పక్కనే పెట్టుకుని పడుకున్నాడు. మధ్య రాత్రి వేళలో శివకు ఫిట్స్ రావడంతో డివైడర్ మధ్యలో పడిపోయాడు. డివైడర్ మధ్యలో వర్షపు నీరు నిలిచి ఉండటంతో ఊపిరి ఆడక అక్కడిక్కడే మృతి చెందాడు. మంగళవారం ఉదయం అటువైపు వాకింగ్‌కు వెళ్తున్న వారు డివైడర్‌పై ఉన్న సెల్‌ఫోన్ చూసి, తీసే క్రమంలో డివైడర్ మధ్యలో నీటిలో మృతి చెంది ఉన్న శివను గుర్తించారు. తల్లి కోమలకు సమాచారం అందించారు. తల్లి ఘటనాస్థలానికి చేరుకుని రోదిస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. శివకు తల్లి కోమల, భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా.. సెంట్రల్ లైటింగ్ కాంట్రాక్టర్ మండల కేంద్రంలో లైటింగ్ పెట్టకుండా, మట్టి పోయకుండా వదిలేయడంతోనే శివ మృతి చెందాడని, మట్టి పోసి ఉంటే ప్రమాదం జరిగేది కాదని గ్రామస్తులు, బంధువులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసి మట్టి పోయించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

నిరంతరాయంగా 200 రోజులు విద్యుత్ ఉత్పత్తి

- రికార్డు సృష్టించిన కేటీపీపీ రెండో దశ 600 మెగావాట్ల ప్లాంట్
- సంబరాలు జరుపుకున్న ఉద్యోగులు



కేటీపీపీలో సంబరాలు జరుపుకుంటున్న ఉద్యోగులు

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రెండో దశ 600 మెగావాట్ల ప్లాంటు నిరంతరాయంగా 200 రోజులు విద్యుదుత్పత్తి చేసి రికార్డు సృష్టించింది. రాష్ట్రంలో 200 రోజులపాటు ఏక కాలంగా ఎలాంటి ఆటంకం లేకుండా రోజుకు 600 మెగావాట్ల విద్యుత్ అందించింది. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో కృషి చేసిన ఇంజనీర్లు, ఉద్యోగులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు.